# ఉత్తమ దర్శకుడు, అత్యుత్తమ మార్గదర్శకుడు శ్రీ మొదలి నాగభూషణశర్మ

– పి.వి. రామమోహన్‌నాయుడు

ఆధునిక రంగస్థలాన్ని రసరంజితం గావించేందుకు నిమగ్నమైన తపస్వి మొదలి నాగభూషణశర్మ. నిత్య ప్రయోగశీలి, నిరంతర పరిశోధకుడు ఆయన. ప్రఖ్యాత సంస్కృత ఆధునిక భారతీయ, పాశ్చాత్య నాటకాలు తానే అనువదించుకొని ప్రదర్శించి తెలుగువారికి వాటి సొగసులు అందించిన కృషీవలుడు. అటు విమర్శతో, అధ్యయనాలతో మన కళాప్రాభవాన్ని నిలపడానికి నడుం బిగించిన సాంస్కృతికసేనాని మొదలి. ఉత్తమ దర్శకుడు, అత్యుత్తమ మార్గదర్శకుడు ఆయన. ప్రఖ్యాత నాటక రచయిత, దర్శకుడు, నటుడు, విమర్శకుడు, అనువాదకుడు, అధ్యాపకుడు, పరిశోధకుడు ఆచార్య మొదలి నాగభూషణశర్మ 1935 జులై 24న గుంటూరు జిల్లా బ్రాహ్మణకోడూరులో జన్మించారు. కామేశ్వరమ్మ, వెంకటసుబ్రహ్మణ్యశర్మ ఆయన తల్లిదండ్రులు. సంస్కారం, సాంస్కృతిక అభిరుచి రెండూ వారి నుంచే శర్మకు ఆనువంశికంగా ప్రాప్తించాయి. స్వగ్రామం బ్రాహ్మణకోడూరుపై గల విశేషాభిమానంతో అచ్చట తాత, తండ్రుల కాలం నుండి ఉన్న వారి ఇండ్ల స్థలాలను సైతం విక్రయించకుండా జ్ఞాపకచిహ్నంగా అలాగే ఉంచటం విశేషం.

ఆయన తండ్రి స్కూలుపాఠాలతో జాతీయతను రంగరించి గోరుముద్దలు తినిపించిన గాంధేయవాది. ఎందరికో రంగస్థలంపై తొలి అడుగులు వేయించిన నిర్దేశకుడు. తల్లి కామేశ్వరమ్మ తన పిల్లలు, పరాయి పిల్లలు అన్న వ్యత్యాసం లేకుండా ఎందరో విద్యార్థులకు తిండిపెట్టి వాళ్ళకడుపులు నిండితే మొహమంతా వెలుగులు నింపుకునేది. నాగభూషణశర్మ సాంస్కృతిక జీవనం ధూళిపూడిలో చదువుకొనే రోజుల్లోనే మొదలయింది. తండ్రి ప్రోద్బలంతో నాటికల్లో పాల్గొనేవారు. కుమారుడి కోసమైనా ఆయన తండ్రి ప్రతి ఏడాది ఒక నాటికను డైరెక్ట్ చేసేవారు. దీనికి తోడు లబ్ధప్రతిష్ఠులైన సాహితీవేత్తలు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, మునిమాణిక్యం, నోరి నరసింహశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు మున్నగువారు కుటుంబ మిత్రులు కావడంతో నాగభూషణశర్మకు సాహిత్యం, కళలపై అభిరుచి అప్రయత్నంగానే అబ్బింది. చిన్నతనం నుంచీ రాయడం, నటించడం, దర్శకత్వం వహించడం కన్యాశుల్కంలో 'మధురవాణి' పాత్ర ధరించి హొయలు కురిపించారు. సుమారు యాభై ప్రదర్శనల్లో ఆయన ఆ పాత్ర వేశారు. బి.ఎ. చదువుతుండగా రాసిన తొలినాటకం 'అన్వేషణ' భారతి పత్రికలో ప్రచురితమైంది. ఆ తరువాత ఆయన రాసిన నాటకాలు చాలా ప్రచురితమయ్యాయి.

1960లో ఉస్మానియా విశ్వవిద్యాలయాలలో ఆంగ్లశాఖలో బోధనావృత్తిని చేపట్టారు. అయితే నాటకంపై అభిమానం చంపుకోలేక హైదరాబాద్‌లోని మిత్రులతో కలిసి ఏదో ఒక కార్యక్రమాన్ని చేపడుతూనే ఉండేవారు. నాటకకళను శాస్త్రీయంగా అభ్యసించడానికి చేస్తున్న పరిశోధనను పక్కకు పెట్టి అమెరికాలోని ఇల్లినాయ్ విశ్వవిద్యాలయంలో చేరి ఎం.ఎఫ్.ఎ.(థియేటర్) పూర్తి చేశారు. అక్కడ శిక్షణలో భాగంగా ఆయన ఎన్నో నాటకాలు

ఆడారు. దర్శకత్వం వహించారు. అదే సమయంలో అమెరికాలో ఉన్న ఆచార్య జి. రామిరెడ్డి, శర్మ ప్రదర్శించిన రవీంద్రనాథ్ ఠాగూర్ నాటకం 'శాక్రిఫైస్' చూశారు. అంతవరకు నాటకాలపై ఏమాత్రం ఆసక్తి కనబరచని జి. రామిరెడ్డి వరుసగా శర్మ నాటకాలన్నింటికీ హాజరయ్యేవారు. అనంతరం రెడ్డి భారతదేశానికి తిరిగివచ్చి ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించాక రాష్ట్రప్రభుత్వ సహకారంతో థియేటర్ ఆర్ట్స్ కోర్సులు ప్రారంభించారు. ఆ శాఖకు తొలి అధిపతిగా మొదలి నాగభూషణశర్మను ఎంపిక చేశారు. దాంతో శర్మలోని ఆసక్తికి వేయిఏనుగుల బలం తోడైనట్లయింది. చాట్ల శ్రీరాములు, రాజా రామదాస్ వంటి నిష్ణాతులను రప్పించి తమ శాఖలో అధ్యాపకులుగా బాధ్యతలు అప్పగించారు. విశ్వవిద్యాలయం ఆసరా ఉండటంతో చాల కార్యక్రమాలు నిర్వహించారు. అందులో ఆచార్య ఆత్రేయ నాటకోత్సవం ముఖ్యమైనది. ఆత్రేయ రాసిన 'ఎవరు దొంగ', 'విశ్వశాంతి', 'కప్పలు', 'ఎన్.జి.ఓ.', 'భయం' వంటి నాటకాలను, ఏకాంకికలను విజయవంతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి మనసుకవి ఆత్రేయ కూడా విచ్చేసి వారంరోజులపాటు వీటిని చూసి ఆనందించారు. తెలుగు రంగస్థలంపై ఇంతటి గౌరవం ఏ రచయితకు ఇంతవరకు లభించలేదు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు డబ్బు, ప్రభుత్వ అండ, అంగబలం కన్నా సంస్కారం, ఉత్తమాభిరుచి ముఖ్యం. డి.ఎస్.ఎన్. మూర్తి, తనికెళ్ళ భరణి, తల్లావఝుల సుందరం, భిక్షు, భాస్కర్ హవల్కర్, విద్యాసాగర్, జి.ఎస్. ప్రసాద్‌రెడ్డి మున్నగువారు ఉస్మానియా థియేటర్ ఆర్ట్స్ శాఖ నుంచి పట్టాలు పొందినవారే. అప్పటికే రంగస్థలంపై ప్రవర్ధమానమైన వీరు సశాస్త్రీయంగా మెళకువలు నేర్చుకోవడానికి మాత్రమే కోర్సులో చేరారు - అంటారు మొదలి నాగభూషణశర్మ. 1988లో సెంట్రల్ యూనివర్సిటీలో సరోజిని నాయుడు ఇనిస్టిట్యూట్ ఆఫ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ ప్రారంభిస్తూ శర్మను తొలి డీన్‌గా నియమించారు. ఆ స్కూల్ కళలకు కాణాచిగా రూపుదిద్దుకోవడానికి ఆయన కృషి ఎంతో ఉంది.

మొదలి నాగభూషణశర్మ రంగస్థల చరిత్ర ఘనమైనది. సుమారు 28 ఆంగ్ల నాటకాలకు ఆయన దర్శకత్వం వహించారు. 'రాజా ఈడిపస్', 'ట్వెల్త్‌నైట్', 'ది విజిట్ 'మ్యాడ్ వుమెన్ ఆఫ్ చల్లియట్', 'శాక్రిఫైస్', 'హయవదన', 'మృచ్ఛకటిక' నాటకాలను ఆయన రూపొందించారు. అదే చేత్తో తెలుగులో 60 నాటకాలకు ఆయన దర్శకత్వం వహించారు. వీటిలో భారతీయ, విదేశీ భాషలకు చెందిన అనేక కళాఖండాలను తెలుగులోకి తర్జుమాచేసి ప్రదర్శింపచేశారు. దీనివల్ల భాష అడ్డంకి కాకుండా అభిరుచి ఉన్న ప్రేక్షకులకు మంచి క్లాసిక్స్ అందించాలన్నది ఆయన నిబద్ధత. 'రాజా ఈడిపస్, "నరజాతి చరిత్ర', 'విశ్వశాంతి', 'విషాదాంతం', 'సైలెన్స్', 'కోర్టు నడుస్తోంది', 'ముద్రారాక్షసం', 'కాయితం పులి', 'బొమ్మరిల్లు', 'ప్రజల మనిషి' ఉన్నాయి. ఆంధ్రకేసరి ప్రకాశంపై రాసి, దర్శకత్వం వహించిన 'ప్రజానాయకుడు ప్రకాశం ఆంధ్రదేశమంతా ఎన్నో ప్రదర్శనలకు నోచుకొంది. వర్తమాన రాజకీయ నాయకుడిపై అందునా ఎందరో అభిమానులు, ప్రత్యర్థులు ఉన్న ప్రకాశంపై నాటకం రూపొందించడం శర్మ గుండెధైర్యాన్ని సూచిస్తుంది.

సాహిత్యం, కళలు, జానపదం, నాటకం, అనువాదాలు, విమర్శలు ఇలా అన్ని ప్రక్రియల్లోనూ సుమారు 14 పుస్తకాలు రాసిన మొదలి నాగభూషణశర్మ, నృత్యంపై రూపొందుతున్న 'నర్తనం' త్రైమాసిక పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. రసరంజని ఆధ్వర్యంలో 'హయవదన' 'ప్రతాపరుద్రీయం' ప్రదర్శించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 1995లో రిటైర్ అయ్యారు. కార్యకలాపాలు ముమ్మరం చేశారు. ఒక పక్క ఉస్మానియా 'సెంట్రల్,

తెలుగు విశ్వవిద్యాలయాల్లో బోధిస్తున్నారు. ఇతర రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాలకు విజిటింగ్ లెక్చరర్‌గా, గెస్ట్ ఫ్యాకల్టీగా హాజరవుతూనే ఉన్నారు. పిహెచ్.డి. విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. స్వయంగా ఎన్నో పరిశోధనలు నిర్వహిస్తున్నారు. తెలుగు నాటకచరిత్రపై బృహత్ గ్రంథం రాస్తున్నారు. జానపద, పద్య గద్య నాటకాలు, తెలుగులో నాటక సమాజాలు, నాటికలు, నటులు, దర్శకులపై నాలుగు భాగాలుగా ఈ ఉద్గ్రంథం ఉంటుంది. ఇందుకు 1902 నుండి కృష్ణాపత్రికలు, 1914 నుంచి ఆంధ్రపత్రిక ఇతర పత్రికలను మథించారు. 18 వేల పేజీలకు విస్తరించిన సమాచారాన్ని కంప్యూటరీకరించారు. నాగభూషణశర్మకు పరిశోధనలంటే అత్యంత ప్రియం. అరవై జానపద కళారీతులను అధ్యయనంచేసి ఎన్నో పుస్తకాలు రాశారు. కాకినాడ సమీపంలోని మాధవపట్నంలో బసచేసి 'తోలుబొమ్మలాట' నేర్చుకున్నారు. ఢిల్లీ సంగీత నాటక అకాడమీ ప్రచురణగా తోలుబొమ్మలాటపై ఒక పుస్తకాన్ని వెలువరించారు. 'తూర్పు భాగవతం' ను దక్షిణమధ్యమండలి సాంస్కృత సంఘం, నాగపూర్ సౌజన్యంతో ప్రచురించారు. ఈ కళారీతులను తీసుకొని ఆయన విదేశాలలో పర్యటించి వచ్చారు. అక్కడి వారికి మన జానపద వెలుగులు పంచి చక్కటి స్పందనను గుండెనిండా నింపుకొని వచ్చారు. జపాన్‌కి 'తోలుబొమ్మలాట' బృందాన్ని నాలుగుసార్లు తీసుకెళ్ళి 15 పట్టణాలలో ప్రదర్శింపచేశారు. వెళ్ళిన ప్రతీ చోటా జపనీయులు వీటిని హర్షాతిరేకంతో స్వాగతించారు. 1876లో వావిలాల వాసుదేవశాస్త్రి 'జూలియస్ సీజర్' తెలుగులో తేటగీతి పద్యాలతో అనువదించినట్టు శర్మ కనుగొన్నారు. మన దేశంలోని తొలి అనువాదాలలో ఇదొకటని ఆయన చెబుతున్నారు. దీనిని ఎడిట్ చేసి ప్రదర్శించాలన్న తలంపుతో ఉన్నారు. 1942లో ద్రోణంరాజు సీతారామారావు 48 నాటకాలు రాసినా అజ్ఞాత రచయితగా మిగిలిన విషయాన్ని చాటి చెప్పాలనే ఉత్సాహంతో శర్మ ఉన్నారు. ద్రోణంరాజు స్వాతంత్ర్య సంగ్రామాలపై రాసిన మాణిక్యం తెలుగు నాటకచరిత్రలో సార్థక నామధేయంగా నిలపాలన్నది ఆయన సత్సంకల్పం. సంగీత నాటక అకాడమీ సభ్యుడిగా కొనసాగుతూ శర్మ 1983 నుండి 5 ఏళ్ళపాటు గురు ఉత్సవం, యువ నృత్య కళాకారుల ఉత్సవం, యక్షగాన ఉత్సవం, కూచిపూడి ఉత్సవం నిర్వహించారు. జాతీయ అకాడెమీలో చిన్నచూపు చూస్తున్న తెలుగు కళాకారులకు సముచిత గౌరవం దక్కడానికి కృషి జరిపారు. తెలుగు పలుకు, కళారీతి, జానపద గలగలలు, కీర్తి కిరీటం ధరించిన తెలుగు కోవిదులను ప్రపంచం నలుచెరగుల పరిచయం గావించడానికి కృషి చేస్తున్న మొదలి నాగభూషణశర్మ నిజంగా మన సాంస్కృతిక రాయబారి.